క్లుప్తంగా

పల్లెల్లో హెల్త్ క్యాంపులు



నమిలిగుండుపల్లి క్యాంపులో వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

వేములవాడరూరల్: పల్లెల్లో విషజ్వరాలతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైనంపై సాక్షి 'వణుకుతున్న పల్లెలు' అనే కథనాన్ని సాక్షిలో గురువారం ప్రచురించడం జరిగింది. దీనికి స్పందించిన వైద్య సిబ్బంది వేములవాడ రూరల్ మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామంలో హన్మాజీపేట పీహెచ్‌సీ పరిధిలో ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దాదాపు 50 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అందులో జ్వరాలు, దగ్గు, ఇతర బాధలు ఉన్న వారికి మందులు అందజేశారు. మిగతా గ్రామాల్లో కూడా క్యాంపులు నిర్వహిస్తామని డాక్టర్ దివ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ యాస్మిన్, ఏఎన్ఎమ్ వసంతకుమారి ఉన్నారు.

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న క్రిస్టోఫర్ తిలక్

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి క్రిస్టోఫర్ తిలక్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు సభను విజయవంతం చేయండి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల కేంద్రంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బహిరంగ సభను విజయవంతం చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గురువారం ఇల్లంతకుంటలో పర్యటించిన రసమయి గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా దివ్యాంగులకు ఆరు స్కూటీలు, రెండు బ్యాటరీ సైకిళ్లు, గ్రామాలకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాల అభివృద్ధి జరుగుతోందన్నారు. రూ.19 కోట్లతో మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి నిర్మించుకోనున్నామని తెలిపారు. శుక్రవారం మంత్రి హరీశ్‌రావు సభకు అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిర్వహణ గాలికి..

- రూ.5 కోట్ల వ్యయంతో మినీస్టేడియం
- పర్యవేక్షణ లోపం.. క్రీడాకారులకు శాపం
- ఏపుగా పెరుగుతున్న పిచ్చిమొక్కలు
- సిట్టింగ్ గ్యాలరీలో పేరుకుపోతున్న చెత్త
- పాడవుతున్న రన్నింగ్ ట్రాక్
- అధికారులు దృష్టి సారించాలని క్రీడాకారులు వేడుకోలు



సిరిసిల్లఅర్బన్: పై ఫొటోలో క్రీడాకారులు బురదలో కబడ్డీ ఆడుతున్నారు. ఇది జిల్లా కేంద్రంలోని స్టేడియంలో పరిస్థితి.. ఇంకా చాలా సమస్యలతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మైదానాలు మినీస్టేడియాలను నిర్మిస్తోంది. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లో అధునాతన సౌకర్యాలతో తెలంగాణకే తలమానికంగా నిర్మించిన మినీస్టేడియంలో పర్యవేక్షణ కరువైంది. ఒక్కోచోట క్రీడా మైదానాలు లేక క్రీడాకారులు ఆపసోపాలు పడుతుంటే ఇక్కడ రూ.కోట్లు పెట్టి నిర్మించిన మినీస్టేడియంలో నిర్వహణ గాలికి వదిలేశారు. స్టేడియం నిండా గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి, చెత్తా చెదారంతో నిండి ఉంది. భావితరాలకు ఉపయోగపడే స్టేడియాన్ని నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. ఏడాది కాకముందే రన్నింగ్ ట్రాక్ పూర్తిగా పాడైపోయింది. ఇప్పటికైనా అధికారులు మినీస్టేడియం నిర్వహణపై దృష్టిసారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.



నిలిచిన వర్షపు నీరు



పాడవుతున్న రన్నింగ్ ట్రాక్

సిరిసిల్ల పట్టణ శివారులో మినీస్టేడియం నిర్మాణానికి పట్టణానికి చెందిన దేశాయి చెన్నమనేని విష్ణుప్రసాద్‌రావు కోట్లు విలువ చేసే 5.14 ఎకరాల సొంత భూమిని విరాళంగా అందించారు. మొదటగా 2014లో రూ.2.10 కోట్ల అంచనాతో మినీస్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించారు. మొదటగా నిర్మాణ పనులను హౌసింగ్ కార్పొరేషన్ ఇంజినీర్ల చేపట్టారు. తదనంతరం 2017లో పంచాయతీరాజ్ శాఖకు పనులు అప్పగించారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిర్మాణ వ్యయం కూడా పెరగడంతో పంచాయతీ రాజ్ శాఖ నుంచి మున్సిపల్ శాఖకు బాధ్యతలు అప్పగించారు. దాదాపు ఆరేళ్ల వ్యవధిలో రూ. 5 కోట్లతో పూర్తిస్థాయిలో మినీస్టేడియంలో అధునాతన సౌకర్యాలతో నిర్మించారు. గత సంవత్సరం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మినీస్టేడియాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ మినీస్టేడియం పర్యవేక్షిస్తుంది.

పర్యవేక్షణ లోపం

మున్సిపల్ పర్యవేక్షణ లోపంతో ప్రారంభమైన ఏడాదికే మినీస్టేడియం ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో స్టేడియం మొత్తం పిచ్చి మొక్కలతో ఎక్కడ చూసిన అపరిశుభ్రంగా కనిపిస్తోంది. క్రికెట్ నెట్ ప్రాక్టీస్‌లో గడ్డి, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. సిట్టింగ్ గ్యాలరీలో చెత్తా చెదారంతో నిండిపోయింది. వాకింగ్ ట్రాక్ నాసిరకం పనులతో ఏడాదికే ఎక్కడిక్కడ పగుళ్లు ఏర్పడి పాడవుతుంది. వర్షం పడినప్పుడు స్టేడియంలో నీరు నిల్వ ఉండడంతో క్రీడాకారులు ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో బురదలోనే విద్యార్థులు ఆటలు ఆడారు. భావితరాలకు ఉపయోగపడే క్రీడామైదానంపై అధికారులు దృష్టి సారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

నిర్వహణ పటిష్టం చేయాలి



రూ.కోట్లు పెట్టి నిర్మించిన మినీస్టేడియం నిర్వహణ నిర్లక్ష్యంగా వదిలేయడం సరి కాదు. స్టేడియం నిర్వహణ పటిష్టం చేయాలి. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– వెంకటేశ్, క్రీడాకారుడు

పర్యవేక్షణ కరువైంది



భావితరాలకు ఉపయోగపడే మినీస్టేడియంపై అధికారులు దృష్టిసారించాలి. మినీ స్టేడియంలో పర్యవేక్షణ కరువైంది. స్టేడియంలో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. నాసిరకం రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో ఏడాది కాక ముందే పాడైంది. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. – బోజ్జ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి, అథ్లెటిక్ అసోసియేషన్

నియామకం

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొల్లి రాంమోహన్, అధ్యక్షుడు జంగంపల్లి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొనాల మధు, ఉపాధ్యక్షుడు రాస వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జడల ఆనంద్, జాయింట్ సెక్రటరీ గౌరారపు వంశీ, కోశాధికారి రాగిపెల్లి బాబు, కార్యవర్గ సభ్యులుగా జుట్టు సురేష్, మొగిలి సంపత్, జంగంపెల్లి ప్రణీత్, ఎడమల సంజయ్ రెడ్డి, బొనాల గౌరి శంకర్, కట్కుం సంతోష్ ఎన్నికయ్యారు. సలహ దారులుగా పారునంది మోహన్, మారుతి, సంతోష్, నిత్యానందం, సుధీర్ రెడ్డి, బాబుప్రసాద్, బాలకృష్ణ, శ్రీధర్ రెడ్డి, న్యాయ సలహదారుగా సజ్జల అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు.

పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్

గంభీరావుపేట: మండల పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కూర ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా బెజుగం రాంరెడ్డి, పచ్చకాంతం, కార్యదర్శిగా చింత చిరంజీవి, సహాయ కార్యదర్శిగా మ్యాకల పర్శరాములు, ఇప్పకాయల నరేందర్, కోశాధికారిగా గన్నమనేని హనుమంతరావు, సలహాదారులుగా మెండె పర్శరాములు, శాదుల్, రాము, శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

గృహలక్ష్మి పట్టాల పంపిణీ



ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు సర్పంచ్ గాండ్ల సుమతి, ఉపసర్పంచ్ వేముల రవీందర్‌గౌడ్‌లు గురువారం పట్టాలు పంపిణీ చేశారు. 32 మంది లబ్ధిదారులను గుర్తించిన అధికారులు.. ఈమేరకు ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ పట్టణంలో 154 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చాడని, ఇంకా సొంత ఇండ్లు లేని వారిని గుర్తించి రూ.3లక్షలు అందించే గృహలక్ష్మి పథకాన్ని వర్తింప చేశారన్నారు. గుడిసెలు లేని ముస్తాబాద్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి కృషి చేస్తున్నారన్నారు. లబ్ధిదారులు త్వరలోనే ఇండ్లకు మూహుర్తాలు పెట్టుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ మంజుల, ఇంచార్జీ ఈవో శ్రీనివాస్, అసిస్టెంట్ నరేష్, రాజు, రవి, నర్సింలు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సత్కారం

వేములవాడరూరల్: నిన్నటి వరకు బీజేపీలో ఉండి నేడు బీఆర్ఎస్ పార్టీలో చేరిన వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్‌ను రూరల్ మండలం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సత్కారాలు చేస్తున్నారు. ఇక మన మధ్య ఎలాంటి పోటీ లేదని, మనమందరం ఒకే పార్టీ అంటూ స్వీట్లు పంచుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనను మండల పరిషత్ కార్యాలయంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సత్కరించారు.

సాంకేతికతతో పంటలు సాగు చేయాలి

ఎల్లారెడ్డిపేట: రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అనుసరిస్తూ.. కొత్త పంటలను సాగుచేసి, అధిక లాభాలు గడించాలని కరీంనగర్ డాట్ కేంద్రం శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ కె.మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బండలింగంపల్లిలో గురువారం వ్యవసాయ సాంకేతిక సమాచార మూలాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి భూమిరెడ్డి, విస్తరణాధికారి శ్రీశైలం, సర్పంచ్ కొత్తపల్లి వాణి, ఎంపీటీసీ కొత్తపల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లతో బదిలీలు చేపట్టాలి

సిరిసిల్లటౌన్: అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులకు పదోన్నలతో కూడిన బదిలీలు చేపట్టాలని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు బూర సదానందం డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సిరిసిల్ల కలెక్టరేట్ ముందు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మధ్యంతర భృతి 15శాతానికి పెంచాలని, బదిలీలు ఐన వారందరిని వెంటనే రిలీవ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి అనుపురం సుధాకర్‌రెడ్డి, జితేందర్‌రావు, రవీందర్, సదానందం, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల అభివృద్ధికి ప్రాధాన్యత

- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- రూ.2 కోట్లతో పాఠశాల అభివృద్ధికి భూమిపూజ



భూమిపూజలో కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్లటౌన్: గతంలో ఏ సర్కారు చేయని రీతిలో బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ బడుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రం సిరిసిల్లలోని ప్రభుత్వ హైస్కూల్‌లో అధునాతన భవనం, మౌలిక వసతుల కల్పనకై రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సర్కారు విద్యను బలోపేతం చేసేందుకే ప్రతి ఏడాది మన ఊరు.. మన బడి కార్యక్రమం చేపడుతుందన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ హైస్కూల్‌లో రాబోవు రోజుల్లో డిగ్రీ, పీజీ కళాశాల తరగతులు కూడా ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న పాఠశాలను పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి మంత్రి కేటీఆర్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, డీఈవో రమేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఆర్‌బీఎస్ చైర్మన్ గడ్డం నర్సయ్య, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, ఆకుల కృష్ణ, సెస్ డైరెక్టర్ దిడ్డి రమాదేవి, హెచ్ఎం సకినాల శ్రీనివాస్, దిడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్పాహారం పథకం ఏర్పాట్లు పరిశీలన..

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రారంభించనున్న అల్పాహార భోజన పథకం ఏర్పాట్లను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పరిశీలించారు. స్థానిక నెహ్రూనగర్ పాఠశాలను సందర్శించి పథకం అమలుపై పరిశుబ్రలన జరిపారు. ఆమెతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎం.డి.ఆయాజ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, హెచ్ఎం రాధారాణి, గన్నమనేని శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

చందుర్తి: ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసమే బతుకమ్మ చీరలను సీఎం కేసీఆర్ బతుకమ్మ పండుగ కానుకగా అందజేస్తున్నారని ఎంపీపీ బైరగోని లావణ్య అన్నారు. మండలంలోని రామన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ చీరలను, ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ నాగం కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పత్తి రవీందర్, సర్పంచ్ దుమ్ము అంజయ్య, ఐకేపీ ఏపీఎం రజిత గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అమ్ముతున్నరు

- దళితులకు, పేదలకు ఇవ్వడం లేదు
- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో దళితులకు, నిరుపేదలకు భూములు ఇవ్వని సర్కారు.. అభివృద్ధి పేరుతో అమ్ముతుందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. సిరిసిలలోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పట్టణీకరణ పేరుతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను లాక్కుంటూ.. అమ్ముకుంటుందని ఆరోపించారు. సిరిసిల్లలోని విలీన గ్రామాల్లో అనధికారికంగా భూసర్వేలు చేస్తూ..పేదల భూములను గుంజుకుంటూ వ్యాపారం చేయడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సదరు భూములను పేదలకు ఇస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, గోనె ఎల్లప్ప, మంగ కిరణ్, అహ్మద్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



పాపయ్యపల్లెలో కాంగ్రెస్ పార్టీ జెండా పండగ

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వాలే

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాబోయే ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలోకి వస్తాయని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని పాపయ్యపల్లెలో గురువారం కాంగ్రెస్ జెండా పండగ నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని), సాయిప్రసాద్, వెంకట్‌రెడ్డి, నర్సాగౌడ్, కొమురయ్య, గంగయ్య, హరికరెడ్డి, సరిత, మంజుల, లత, పుష్పలత, కవిత, శ్రీకాంత్‌గౌడ్, పరుశురాములు, మునిగెల రాజు, మల్లేశం యాదవ్, నాగరాజు తదితరలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నాకు మద్దతు ఇస్తున్న సీపీఎం, సీఐటీయూ

వేములవాడ: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ. 15 వేలు చెల్లించాలని పేర్కొంటూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఇంటి ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. వీరికి సీఐటీయూ, సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లింపులకు బడ్జెట్ విడుదల చేయాలని, కొత్త మెనుకు బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలనీ, జీవో నెంబర్ 8 ప్రకారం వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, గుర్తింపు కార్డులు, షరతులు లేకుండా బ్యాంకు రుణాలు కాటన్ బట్టల యూనిఫామ్ ఇవ్వాలని, అలాగే వంటషెడ్లు, వంట పాత్రలాంటి మౌలిక వసతులు, సామాజిక భద్రత, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దారుకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీధర్, సీపీఎం జిల్లా నాయకులు ముక్తికాంత అశోక్, మల్లారపు ప్రశాంత్, మధ్యాహ్న భోజన కార్మికులు గొట్టే బాలమణి, బాలగోని కవిత, కొలనూరు బాబాయ్, బండి దేవవ్వ, గొర్రె అనుమవ్వ మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మద్దతు పలకాలి



జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను గురువారం ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. మొర్రాయిపల్లె, గూడూరు, రాంరెడ్డిపల్లె గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను, మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం చీకోడులో యాదవ మినీ ఫంక్షన్‌హాల్‌ను, రెడ్డి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. చిప్పలపల్లిలో ప్రగతి భవన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. చిప్పలపల్లిలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వగా గృహప్రవేశాలు చేశారు. మంత్రి కేటీఆర్ కృషితో ముస్తాబాద్‌ను మోడల్ మండల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆశీర్వదించి, అభివృద్ధికి మద్దతు పలకాలని కోరారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సర్పంచ్‌లు సుజాత, రమేశ్, జ్యోతి, పోచయ్య, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపూరావు, నాయకులు పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా గెలిపించుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మండల రజక సంఘం కమ్యూనిటీ భవనం వద్ద బోరుబావికి గురువారం ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు గురువారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఎంపీటీసీ ఎలగందుల అనసూయ, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, రాష్ట్ర రజక సంఘం కోఆర్డినేటర్ లోకుర్తి బాలమల్లు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, రజక సంఘం ప్రతినిధులు ధర్మారం రవి, సల్మాల కైలాసం తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



ముస్తాబాద్: నెల రోజుల క్రితమే ఆపరేషన్ చేయించుకున్న కడుపునొప్పి తగ్గలేదని వ్యాధి నయం కావడం లేదని మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రైతు కంతుల దేవయ్య(40) గ్రామ శివారులో మానేరు కెనాల్ వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దేవయ్య బుధవారం రాత్రి పొలం పనులకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. అర్ధరాత్రి వరకు కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించిన దేవయ్య ఆచూకీ లభించలేదు. గురువారం తెల్లవారి కెనాల్ పక్కనే దేవయ్య విగతజీవిగా చెట్టుకు వెళ్లాడడంతో భార్య రేఖ, పిల్లలు సాత్విక్, మనీష, తల్లి యాదవ్వలు కన్నీరుమున్నీరుగా విలపించారు. నెల రోజుల క్రితమే దేవయ్యకు శస్త్రచికిత్స జరిగిందని, తిరిగి కడుపునొప్పి రావడంతో మనోవేదనకు అనారోగ్యం భరించలేక దేవయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. మృతుడి సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే చేతులమీదుగా నేడు 'సీఎం అల్పాహారం' ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి అల్పాహారం పథకం శుక్రవారం వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రారంభించనున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద ఈనెల 7న మందకృష్ణ మాదిగ చేపట్టే మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు సంబంధించి పోస్టర్‌ను మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో తంగళ్లపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం రాత్రి వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు.

ఈ పంచాయతీ ఆపరేటర్లకు సంఘీబావం

తంగళ్లపల్లి: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లకు తంగళ్లపల్లి పంచాయతీ కార్యదర్శులు గురువారం సంఘీభావం తెలిపారు.

తడగొండలో మేరీ మాటి .. మేరీ దేశ్

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేరీ మాటి.. మేరీ దేశ్ కింద ఇంటింటికి తిరిగి మట్టి సేకరించారు.

మోడల్ లే అవుట్ అవగాహన వాయిదా

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లలోని సినారె ఆడిటోరియంలో శుక్రవారం చేపట్టే మోడల్ లే అవుట్‌పై అవగాహన సదస్సును వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.డి.అయాజ్ ప్రకటించారు. త్వరలోనే నిర్వహణ తేదీలు ప్రకటిస్తామని గురువారం వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి పంపిణీ చేశారు.

నేడు సదెరం క్యాంపు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నేడు సదెరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు గురువారం తెలిపారు. టి చూపు, 11న ఆర్థోపెడిక్, 18న వినికిడి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ పరీక్షలు చేసుకునే వారు మీ సేవా కేంద్రాల్లో బుక్ చేసుకొని, సంబంధిత పత్రాలతో హాజరుకావాలన్నారు.

అలరించిన చిదతల రామాయణం

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలో గురువారం స్థానిక బస్‌స్టాండ్ ప్రాంతంలో శ్రీ దాసాంజనేయ స్వామి నాట్య మండలి ఆధ్వర్యంలో చిరుతల రామాయణం నాటకం వేశారు